మీ గళం.. మా కలం...!

# నమస్తే హైదరాబాద్

www.namasthehyderabad.in

తెలుగు దిన పత్రిక



విలేకరులు కావలెను

నిత్యనూతనంగా వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న నమస్తే హైదరాబాద్ తెలుగు దినపత్రికకు తెలంగాణ రాష్ట్రం లోని అన్ని జిల్లా, మండల కేంద్రాలలో విలేకరులు కావలెను

సీనియర్‌లకు ప్రాధాన్యం కొత్తవారికి అవకాశం

Ph: 9912580066



రంగా రెడ్డి సంపుటి : 13 సంచిక :262 ఎడిటర్: గొడిశాల సోమయ్య గురువారం 20-02-2025 పేజీలు :4 వెల : 2రూ


## తెలంగాణ భవన్‌కు గులాబీ బాస్..



బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన పార్టీ కీలక సమావేశం జరుగుతోంది. 2001 ఏప్రిల్ 27న ఆవిర్భవించిన బీఆర్ఎస్ పార్టీ 25వ వసంతంలోకి ప్రవేశిస్తున్న నేపథ్యంలో ఈ భేటీపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. తెలంగాణభవన్‌లో రాష్ట్ర కార్యవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గం, జిల్లా అధ్యక్షులు, ప్రస్తుత, మాజీ ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు, జిల్లా పరిషత్ చైర్మన్లు, డీసీసీబీ, డీసీఎంఎస్ అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు సమావేశానికి హాజరయ్యారు. ఈ నెలాఖరులో బహిరంగ సభ నిర్వహించాలని పార్టీ నాయకత్వం మొదట నిర్ణయించింది. అయితే బహిరంగ సభను ఈ నెలలో నిర్వహించడం కన్నా.. పార్టీ ఆవిర్భావ దినోత్సవం రోజు నిర్వహిస్తే బాగుంటందాన్న అంశంపై చర్చిస్తున్నారు. అధ్యక్ష ఎన్నిక నాటికి పార్టీ సభ్యత్వ నమోదు, గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి దాకా పార్టీ ప్రధాన కమిటీలు, అనుబంధ కమిటీల ఎన్నికల నిర్వహణ, సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో అధ్యక్ష ఎన్నిక నిర్వహణ తదితర అంశాలపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. పార్టీ చేపట్టాల్సిన కార్యాచరణ, అనుసరించే వ్యూహంపై పార్టీ శ్రేణులకు అధినేత కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు.


# రేవంత్ సర్కార్ గుడ్ న్యూస్..

## మొదట కొత్త రేషన్ కార్డులు అందేది ఆ జిల్లాల వారికే..



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డుల పంపిణీకి పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తోంది. కొత్త దరఖాస్తులకు రేషన్ కార్డులు ఇవ్వడంతో పాటు, పాత కార్డుల్లో మార్పులు, చేర్పులు చేసిన వారికి కొత్త కార్డులు మంజూరు చేయాలని నిర్ణయించింది. ఈ ప్రక్రియ ద్వారా దాదాపు కోటి రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నది. కొత్తగా అందించనున్న రేషన్ కార్డులు పోస్ట్‌కార్డు సైజులో ఉండేలా రూపొందిస్తున్నారు. కార్డుపై ప్రభుత్వ లోగోతో పాటు సీఎం రేవంత్ రెడ్డి, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చిత్రాలు ఉండే అవకాశం ఉంది. రేషన్ షాపు నంబర్, కుటుంబ సభ్యుల వివరాలు, అడ్రస్ తదితర సమాచారంతోపాటు, ఆధునిక సాంకేతికతగా బార్ కోడ్ లేదా క్యూఆర్ కోడ్ పొందుపరిచే యోచనలో ఉన్నారు. బయోమెట్రిక్ ఆధారంగా సరఫరా.. రేషన్ షాపుల్లో బార్ కోడ్ స్కానింగ్, బయోమెట్రిక్ విధానం ద్వారా నిత్యావసర సరఫరా సౌలభ్యం కల్పించాలని ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తోంది. ఈ విధానం అమలులోకి వస్తే పారదర్శకత పెరిగి, అనర్హులకు రేషన్ సరఫరా నివారించేందుకు 2లో

## భారత ఫార్మాకు ట్రంప్ సుంకాల ముప్పు



న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో బాంబు పేల్చారు. యూఎసలోకి దిగుమతయ్యే ఔషధాలు, సెమీకండక్టర్లపై 25 శాతం లేదా అంతకంటే అధిక సుంకం విధిస్తానని, ఆపై సుంకాన్ని మరింత పెంచుకుంటూ పోతానని హెచ్చరించారు. అదే గనక జరిగితే, భారత ఫార్మాస్యూటికల్స్ రంగం, ప్రధానంగా హైదరాబాద్‌కు చెందిన ఔషధ కంపెనీలపై అధిక ప్రభావం పడనుంది. దేశీయ ఫార్మా సంస్థల జనరిక్ ఔషధాలకు అమెరికా అతిపెద్ద మార్కెట్ కావడమే అందుకు కారణం.. ఫార్మా ఎగుమతుల ప్రోత్సాహక కౌన్సిల్ (ఫార్మెక్సిల్) లెక్కల ప్రకారం..2023-24 ఆర్థిక సంవత్సరంలో భారత ఫార్మా కంపెనీలు అమెరికాకు 870 కోట్ల డాలర్ల (ప్రస్తుత మారకం విలువ ప్రకారం రూ.75,690 కోట్లు) ఔషధాలను ఎగుమతి చేశాయి. ఫార్మా ఎగుమతుల్లో అమెరికా వాటాయే 31 శాతంగా ఉంది.

## హైదరాబాద్-విజయవాడ రూట్లో ప్రయాణించే వారికి గుడ్‌న్యూస్..

ప్రయాణికులకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ ఆర్టీసీ) శుభవార్త తెలిపింది. విజయవాడ రూట్‌లో ప్రయాణించే వారికి ఈ గుడ్‌న్యూస్ అందించింది. హైదరాబాద్-విజయవాడ మార్గంలో ప్రత్యేక రాయితీలను ప్రకటిస్తున్నట్లు తెలంగాణ ఆర్టీసీ వెల్లడించింది. లహరి- నాన్ ఏసీ స్లీపర్ కమ్ సీటర్, సూపర్ లగ్జరీ సర్వీసుల్లో 10 శాతం రాయితీ, అదే రాజధాని ఏసీ బస్సుల్లో 8 శాతం డిస్కౌంట్ ఇస్తున్నట్లు టీజీఆర్టీసీ తెలిపింది. ఈ మేరకు బుధవారం ఆర్టీసీ యాజమాన్యం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ రాయితీతో కల్పించే డిస్కౌంట్ సదుపాయాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని సూచించింది. టీజీఎస్‌ఆర్టీసీ బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్ కోసం http://tgsrtcbus.in అధికారిక వెబ్‌సైట్‌ని సందర్శించాలని సూచించింది. ఈ విషయాన్ని టీజీఎస్ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ సోషల్ మీడియా ప్లాట్?ఫామ్ ఎక్స్ (ట్విట్టర్) వెల్లడించారు. విజయవాడ రూట్‌లో ప్రయాణించే వారికి టికెట్లపై ఆర్టీసీ డిస్కౌంట్ ఇస్తున్నట్లు తెలిపారు.

## కేసీఆర్, రేవంత్‌పై ఈటల హాట్ కామెంట్స్.. ఏమన్నారంటే..

వరంగల్, ఫిబ్రవరి 19: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తీవ్ర విమర్శలు చేశారు. అంతేకాదు.. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కేసీఆర్ బాటలోనే నడుస్తోందని మండిపడ్డారు. ఇలాగే చేస్తే కేసీఆర్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు కూడా పడుతుందని హెచ్చరించారు ఈటెల రాజేందర్. బుధవారం మీడియాతో మాట్లాడిన ఈటెల రాజేందర్.. తెలంగాణ రాష్ట్రంలో విద్యా వ్యవస్థలను కేసీఆర్ భ్రష్టు పట్టించారని విమర్శించారు. అదే తరహాలో కాంగ్రెస్ నడుస్తోందన్నారు. బీఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్ పార్టీకి పడుతుందని వ్యాఖ్యానించారు. పార్లమెంట్ చట్టం ప్రకారం భూ నిర్వాసితులకు 3 రెట్లు అధికంగా పరిహారం ఇవ్వాల్సి ఉంటుందని.. కానీ, ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఈటల ఆరోపించారు.

జాతీయ రహదారుల కోసం సేకరించే భూములను రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలని.. 2లో



## ఢిల్లీ ముఖ్యమంత్రిగా రేఖా గుప్తా..




ఢిల్లీలో ఉత్కంఠకు తెరపడింది. ఢిల్లీ ముఖ్యమంత్రిగా రేఖా గుప్తాను బీజేపీ ఎమ్మెల్యేలు ఎన్నుకున్నారు. 48 మంది ఎమ్మెల్యేలు ఆమెను ఏకగ్రీవంగా బీజేపీ శాసనసభా పక్ష నేతగా ఎన్నుకున్నారు. దీంతో ఢిల్లీకి మరోసారి మహిళా సీఎం పగ్గాలు చేపట్టబోతున్నారు. రేఖా గుప్తాకు ఢిల్లీ మేయర్‌గా పనిచేసిన అనుభవం ఉంది. ఢిల్లీ యూనివర్సిటీ ప్రెసిడెంట్‌గా ఆమె రెండుస్తారు ఎన్నికయ్యారు. ఢిల్లీ పీతంపురా నుంచి కౌన్సిలర్‌గా, తర్వాత మేయర్‌గా పనిచేశారు. భారతీయ జనతా పార్టీ శాసనసభా పక్ష సమావేశంలో, ముఖ్యమంత్రి పదవికి రేఖ గుప్తా, డిప్యూటీ ముఖ్యమంత్రి పదవికి ప్రవేశ్ వర్మ పేరును ఖరారు చేశారు. అలాగే, విజేంద్ర గుప్తాను అసెంబ్లీ స్పీకర్‌గా నియమిస్తారు.రేఖా గుప్తాకు గతంలో ఎమ్మెల్యే, ఎంపీగా పనిచేసిన అనుభవం లేదు. కానీ రాజకీయంగా ఆమెకు సుదీర్ఘ అనుభవం ఉంది. విద్యార్థి నాయకురాలిగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన ఆమె.. పితంపుర, షాలీమార్ బాగ్ ప్రాంత ప్రజలకు సుపరచితురాలు. స్థానికంగా పార్కుల అభివృద్ధికి ఆమె ఎంతగానో కృషిచేశారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండేవారు. రేఖాగుప్తా కుటుంబానికి సంఘ్ నేపథ్యం ఉండటం ఆమెకు కలిసొచ్చింది. విద్యార్థి దశలో ఏబీవీపీలో చురుకైన పాత్ర పోషించిన ఆమె ఆ తర్వాత బీజేపీలో చేరారు. పితంపుర కౌన్సిలర్‌గా, షాలీమార్ బాగ్-బి నుంచి కార్పొరేటర్‌గా ఎన్నికయ్యారు. స్థానిక ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండే నాయకురాలు. ఢిల్లీ ప్రాంతంలో పార్టీ వాయిస్‌ను గట్టిగా వినిపించే నేతల్లో ఆమె ఒకరు. షాలీమార్ బాగ్ శాసనసభ నియోజకవర్గం నుంచి 2015, 2020 ఎన్నికల్లో బీజేపీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసి సమీప ప్రత్యర్థి ఆప్‌కు చెందిన బందనాకుమారి చేతిలో ఓటమి చెందారు. 2025లో అదే నియోజకవర్గం నుంచి బందనాకుమారిని 29వేలకు పైగా ఓట్ల తేడాతో ఓడించారు. రేఖాగుప్తా బీజేపీలో ఎన్నో బాధ్యతలు నిర్వర్తించారు. బీజేపీ ఢిల్లీ శాఖ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. పదవులతో సంబంధం లేకుండా నిరంతరం ప్రజల్లో ఉంటూ.. వారి సమస్యల పరిష్కారం కోసం కృషిచేయడమే ఆమెను సీఎంగా బీజేపీ ఎంపిక చేయడానికి ఒక కారణంగా చెప్పుకోవచ్చు.

## ఎప్‌సెట్‌లో దివ్యాంగుల రిజర్వేషన్

హైదరాబాద్, ఫిబ్రవరి 19: 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు నిర్వహించే టీఎస్ ఎప్‌సెట్ నోటిఫికేషన్ గురువారం విడుదలకానున్నది. ఎప్‌సెట్ అర్హతలు, షెడ్యూల్‌ను మధ్యాహ్నం 2:30 గంటలకు వెబ్‌సైట్‌లో పొందుపరుస్తారు. తొలిసారిగా ఎప్‌సెట్‌లో దివ్యాంగులకు 5శాతం రిజర్వేషన్ వర్తింపజేస్తారు. ఆన్‌లైన్ దరఖాస్తులు 25 నుంచి ప్రారంభమై.. ఏప్రిల్ 4 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ సారి ఏపీలో విజయవాడ, కర్నూల్‌లో పరీక్షాకేంద్రాలు ఏర్పాటు చేస్తారు.

## ఢిల్లీ సీఎం ప్రమాణస్వీకారానికి కేజ్రీవాల్, అతిషి హాజరవుతారా?



న్యూఢిల్లీ: ఇరవై ఏడేళ్ల తర్వాత దేశ రాజధానిలో బీజేపీ పాలనకు శ్రీకారం చుడుతూ కొత్త ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారానికి రామ్‌లీలా మైదాన్ ముస్తాబవుతోంది. ఫిబ్రవరి 20వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుంది. భారీ ఏర్పాట్ల మధ్య జరుగుతున్న ఈ కార్యక్రమానికి ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్, 2లో

## ఉమ్మడి ఏపీతోనే తెలంగాణకు తీరని నష్టం

హైదరాబాద్, ఫిబ్రవరి19 రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటు, రాష్ట్రాల సరిహద్దుల్లో వచ్చిన మార్పుల కారణంగా తెలంగాణ ప్రాంతానికి తీరని నష్టం వాటిల్లిందని, బేసిన్‌లోనే ఉన్నా కృష్ణా జలాలు దక్కకుండా పోయాయని తెలంగాణ వివరించింది. బేసిన్‌లోని రాష్ట్రాలు నీళ్ల కోసం అల్లాడుతుంటే, ఏపీ మాత్రం బేసిన్ అవతలికి 323 టీఎంసీలను మళ్లిస్తున్నదని, ఇది వాంఛనీయం కాదని తేల్చిచెప్పింది. ఈ మేరకు బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్‌కు తెలంగాణ తరపు న్యాయవాదులు నివేదించారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన సెక్షన్-3 మార్గదర్శకాల మేరకు ఇరు రాష్ట్రాల మధ్య కృష్ణాజలాల పునఃపంపిణీకి సంబంధించి విచారణను బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ బుధవారం ప్రారంభించింది. కృష్ణా బేసిన్‌కు సంబంధించి చారిత్రక, భౌగోళిక అంశాలను 2లో



## రేవంత్ సర్కార్ గుడ్ న్యూస్.. మొదట కొత్త రేషన్ కార్డులు అందేది ఆ జిల్లాల వారికే..

వీలవుతుంది.

మహిళల పేరుమీదనే కొత్త కార్డులు ప్రభుత్వం ఇప్పటికే అనేక సంక్షేమ పథకాలను మహిళల పేరుమీద అందజేస్తోంది. అదే విధంగా, రేషన్ కార్డులను కూడా గృహిణి పేరుమీద జారీ చేయాలని నిర్ణయించింది. ఈ చర్య ద్వారా కుటుంబాలకు సదుపాయాలు మరింత బలోపేతం అవుతాయని భావిస్తున్నారు.చిత్రాలు లేకుండానే కొత్త కార్డులు?కుటుంబ ఫొటోలను కార్డుపై అద్దాలా? వద్దా? అనే అంశంపై చర్చలు జరిగాయి. తరచుగా కుటుంబ సభ్యుల్లో మార్పులు జరిగే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని, ఫొటోలను ప్రదర్శించకుండా ఉండే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఎక్కడి నుంచి ప్రారంభం?ప్రస్తుతం ఎన్నికల నియంత్రణ లేని ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో మొదటగా కొత్త రేషన్ కార్డుల పంపిణీ చేపట్టనున్నారు. దేశవ్యాప్తంగా ఫుడ్ సెక్యూరిటీ విధానం అమల్లోకి వచ్చిన తర్వాత, రేషన్ కార్డులను 'ఫుడ్ సెక్యూరిటీ కార్డులు (%ఖీూజ%)'గా పిలుస్తున్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 89.96 లక్షల రేషన్ కార్డులు ఉన్న నేపథ్యంలో, కొత్త కార్డులు జారీ అయిన తరువాత ఈ సంఖ్య కోటి మార్కును చేరుకోనుంది.

## ఢిల్లీ సీఎం ప్రమాణస్వీకారానికి కేజ్రీవాల్, అతిషి హాజరవుతారా?

మాజీ సీఎం అతిషికి ఆహ్వానం పంపుతున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. కేజ్రీవాల్, అతిషితో పాటు ఢిల్లీ కాంగ్రెస్ చీఫ్ దేవేంద్ర యాదవ్‌ను స్వయంగా బీజేపీ ఢిల్లీ చీఫ్ వీరేంద్ర సచ్‌దేవ్ ఆహ్వానించనున్నారు. దేశ రాజధానిలోని క్యాబ్ డ్రైవర్లు, ఆటో డ్రైవర్లు, గిగ్ వర్కర్లు, మురికివాడల ప్రజానీకాన్ని కూడా ఈ వేడుకకు ఆహ్వానిస్తున్నారు.

## ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు ...

### ర్యాలీని ప్రారంభించిన జగదీశ్వర్ గౌడ్



నమస్తే హైదరాబాద్,శేరిలింగంపల్లి : ఛత్రపతి శివాజీ తన ధీరత్వంతో, నియంతృత్వాన్ని ఎదిరించి, సామాజిక రాజ్య స్థాపనతో సబ్బండ వర్గాలకు పాలనలో భాగస్వామ్యం కల్పించిన మహారాజ్ అని శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇంచార్జి జగదీశ్వర్ గౌడ్ అన్నారు.బుధవారం ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా రచమల్ల నాగేశ్వర్ గౌడ్,మల్లేష్ యువకుల ఆధ్వర్యంలో మియపూర్ లోని శివాలయం దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ మహరాజ్ శోభయాత్రను శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇంచార్జి జగదీశ్వర్ గౌడ్ జెండా ఊపి ప్రారంభించారు.అనంతరం ఆయనకు జగదీశ్వర్ గౌడ్ పూలమాల వేసు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ శోభయాత్ర మియాపూర్ న్యూ కాలనీలోని శివాలయం నుండి లింగంపల్లిలోని తుల్జా భవాని ఆలయం వరకు సాగింది. ఈ శోభయాత్రలో తెలంగాణ రాష్ట్ర లేబర్ సెల్ ఉపాధ్యక్షులు నల్ల సంజీవ రెడ్డి,రంగారెడ్డి జిల్లా జనరల్ సెక్రటరీ వేరేందర్ గౌడ్,నియోజకవర్గ నాయకులు మన్నెపల్లి సాంబశివరావు,రామచందర్ గౌడ్,రవి కుమార్,రాంబాబు,నవీన్,లక్ష్మీ,ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

## 2008 డీఎస్సీ అభ్యర్థులకు కాంట్రాక్టు పద్ధతిలో ఉపాధ్యాయులుగా నియామక పత్రం అందజేసిన ఎంఈఓ వాసం ప్రభాకర్

నాగారం, నమస్తే హైదరాబాద్ :(ఫిబ్రవరి 19)

2008 డిఎస్సి అభ్యర్థులను కాంట్రాక్టు పద్ధతిలో ఉపాధ్యాయులుగా ఎంపిక ఆయన అభ్యర్థులకు మండల విద్యాధికారి వాసం ప్రభాకర్ బుధవారం నియామక పత్రాలు అందజేశారు. నాగారం మండలంలోని పసునూరు,డి కొత్తపల్లి,ఫణిగిరి, మామిడిపల్లి ఈటూరు గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా నియమించినట్లు తెలియచేశారు. అనంతరం వారిని అభినందిస్తూ ఉన్నతమైన విద్యాబోధన అందించాలని సూచించారు.



## కేసీఆర్, రేవంత్‌పై ఈటల హాట్ కామెంట్స్.. ఏమన్నారంటే..

కేంద్రం డబ్బులు చెల్లిస్తుందని ఈటల రాజేందర్ తెలిపారు. గ్రీన్ ఫిల్డ్ భూ సేకరణలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఈటల ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా గ్రీన్ ఫిల్డ్ భూ నిర్వాసితులు తీవ్రంగా నష్టపోతున్నారని విమర్శించారు. గ్రీన్ ఫిల్డ్ హై వే పనులు వేగంగా జరుగుతున్నా.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం.. కేంద్రంపై బురద జల్లే ప్రయత్నం చేస్తోందని ఈటల విమర్శించారు. రేవంత్ రెడ్డి ఇకనైనా కళ్లు తెరవాలని హితవు చెప్పారు ఎంపీ. ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రజలకు రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలపై పోరాటం చేస్తామని ఎంపీ ఈటల ప్రకటించారు. దేశ వ్యాప్తంగా కులగణన చేసే పరిస్థితి లేదని ఈటల స్పష్టం చేశారు. కుల గణనకు బీజేపీ వ్యతిరేకం కాదని స్పష్టం చేశారాయన. కాంగ్రెస్ పార్టీ చేసిన కులగణనకు చట్టబద్ధత ఉందా? అని ఎంపీ ప్రశ్నించారు. తమిళనాడులో చేసిన విధంగా చేస్తే స్వాగతిస్తామన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీకి కట్టుబడి కులగణన చేసి స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు.

## ఉమ్మడి ఏపీతోనే తెలంగాణకు తీరని నష్టం

ట్రిబ్యునల్ చైర్మన్ జస్టిస్ బ్రిజేశ్‌కుమార్, సభ్యులు జస్టిస్ రామ్మోహన్‌రెడ్డి, జస్టిస్ ఎస్ తలపాత్ర తెలుసుకున్నారు. తెలంగాణ సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ ఆయా అంశాలపై ట్రిబ్యునల్‌లో వాదనలను ప్రారంభించారు. కృష్ణా పరీవాహక ప్రాంతం, దాని ఉపవాగుల ప్రాధాన్యతలను వివరించారు. 1956లో రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణతో రాష్ట్ర సరిహద్దుల్లో వచ్చిన మార్పులను మ్యాప్‌ల సహాయంతో వివరించారు. అదేవిధంగా తెలంగాణకు సంబంధించి ప్రస్తుతం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌ల కింద ప్రతిపాదించిన నీరు, ఆయకట్టుకు వాస్తవానికి తుంగభద్ర డ్యామ్, కృష్ణా నదిపై అప్పర్ కృష్ణా ప్రాజెక్ట్ కాలువలు, భీమా ప్రాజెక్ట్‌ల ద్వారా గ్రావిటీ ద్వారా అందించేందుకు ప్రణాళికలను రూపొందించారని గుర్తుచేశారు. రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ అనంతరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సర్కార్ ఆ ప్రణాళికలను అమలు చేయలేదని, కేవలం నీరు, ఉపాధి, ఆర్థిక విషయాల్లో ఆంధ్ర ప్రాంతానికి అనుకూలంగా వ్యవహరించిందని వివరించారు. దీంతో తెలంగాణకు తీరని నష్టం వాటిల్లిందని తెలిపారు. తెలంగాణ ప్రాజెక్టులకు కేటాయించిన జలాలు అంతంత మాత్రమేనని వివరించారు.

## ఘనంగా చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు

కూకట్ పల్లి (నమస్తే హైదరాబాద్) : మరాఠా యోధుడు చత్రపతి శివాజీ జయంతి వేడుకలను శ్రీ చత్రపతి శివాజీ మహారాజ్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో బుధవారం దీనబందు కాలనీ చౌరస్తాలో ఘనంగా జరుపుకున్నారు. బీజేపీ సీనియర్ నాయకులు దుర్గాప్రసాద్, నరేందర్ రెడ్డి, రేపన్ రాజు, ఎత్తరి రమేష్, రాజు ముదిరాజ్, బాలు, నర్సింగరావు, దేవుని గారి లక్ష్మణ్, అభిషేక్, నరసింహచారి, మురళి, భాస్కర్ రెడ్డి తదితరులతో కలసి కాలనీ అధ్యక్షులు ఎం.మహేందర్ నాయక్ శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, సనాతన ధర్మ పరిరక్షణకు, హిందూ సామ్రాజ్య విస్తరణకు ఛత్రపతి శివాజీ ఎనలేని పోరాటం చేశారన్నారు. చత్రపతి శివాజీ ధైర్య సాహసాలు, తెగువతో వీరోచిత పోరాటం చేసి మొగల్ సామ్రాజ్యాన్ని గజగజ వణికించారని పేర్కొన్నారు. హిందూ ధర్మాన్ని పరిరక్షించేందుకు శివాజీ చేసిన పోరాటం చిరస్మరణీయమని వారు కొనియాడారు. ప్రతిఒక్కరూ శివాజీ ఆశయ సాధనకు పాటుపడాలని ఈ



సందర్భంగా వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, చత్రపతి శివాజీ అభిమానులు పాల్గొన్నారు.

## మల్కాం చెరువు తరహాలో తటాకాల సుందరీ కరణ : జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి



నమస్తే హైదరాబాద్,శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి జోన్ లో తటకాలను పూర్తిస్థాయిలో సుందరీకరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి పేర్కొన్నారు. మల్కం చెరువు తరహాలో గంగారం ,పటేల్ కుంట చెరువులను అభివృద్ధిపరిచి ఆహ్లాదానికి నెలవుగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. హెచ్ఎండిఏ ,జిహెచ్ఎంసి అధికారులతో కలిసి జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి బుధవారం పటేల్ కుంట ,గంగారం చెరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ ఎం డి ఏ నిధులతో చెరువుల అభివృద్ధి, సుందరీ కరణ చర్యలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. చెరువుల విస్తీర్ణం గుర్తించి చుట్టూ పటిష్టమైన బండ్ ఏర్పాటు ,లాన్, వాకింగ్ ట్రాక్, అందమైన విద్యుత్ లైట్లు, చిన్నారులకు ఆటపరికరాలను ఏర్పాటు చేస్తామన్నారు . ఇందుకు సంబంధించి సమర్థమైన ప్రణాళికలను రూపొందించాలని జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి అధికారులకు సూచించారు .చెరువుల సుందరీ కరణ, అభివృద్ధికి సంబంధించిన పనులకు ఎటువంటి ఆటంకం లేకుండా ముందస్తుగా న్యాయపరమైన అంశాలన్నింటిని పరిష్కరించి ముందుకు సాగాలని ఆదేశించారు. మాల్స్ ,హాల్స్ లకు ప్రత్యామ్నాయాలుగా పచ్చదనంతో ఆహ్లాదం అందించేలా చెరువుల సుందరీ కరణ చేస్తామన్నారు .ప్రతి చెరువును పిక్నిక్ స్పాట్గా మలచి శేరిలింగంపల్లి జోన్ ప్రతిష్టను మరింత ఇనుమడింప చేసేలా చర్యలు చేపడతామని జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి స్పష్టం చేశారు .వీటి పర్యవేక్షణ పై ఏర్పాటు చేసిన అధికారులు విలువైన స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా విజిలెన్స్ పెట్టాలని, చెరువుల పరిసరాలలో నిర్మాణ, ఇతర వ్యర్థాలు వేయకుండా పకడ్బందీగా పర్యవేక్షించాలని ఆదేశించారు . ఈ కార్యక్రమంలో హెచ్ఎండిఏ సీఈ రవీందర్ చందానగర్ సర్కిల్ ఉప కమిషనర్ మోహన్ రెడ్డి ,వైద్యాధికారి డాక్టర్ రవి, డిఈ దుర్గాప్రసాద్ ,ఇరిగేషన్ డీ ఈ నళిని, హెచ్ఎండిఏ అధికారులు పాల్గొన్నారు. హెచ్ఎండిఏ ,ఇరిగేషన్ అధికారులతో దుర్గం చెరువు తనిఖీ

శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని దుర్గం చెరువును హెచ్ఎండిఏ ,ఇరిగేషన్ అధికారులతో కలిసి జాయింట్ తనిఖీని జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మురుగునీరు చేరకుండా చేపట్టాల్సిన ప్రత్యామ్నాయ చర్యలపై అధికారులతో జోనల్ కమిషనర్ సమీక్షించారు. ప్రత్యేక పైప్లైన్ ద్వారా మురుగునీటి డైవర్షన్ చర్యలు తీసుకోవాలని సూచించారు. చెరువు పరిసరాలలో నివసించే ప్రజల నివాసాల నుంచి వచ్చే మురుగునీరు చెరువులోకి చేరకుండా, స్వతహాగా పైప్ లైన్లతో డ్రైనేజీలకు అనుసంధానించుకునేలా అవగాహన కల్పించాలని జోనల్ కమిషనర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎండిఏ సీఈ రవీందర్ డిప్యూటీ శివకుమార్ రెడ్డి, ఇరిగేషన్ డిప్యూటీ ఈఈ నళిని ,ఏఈ పావని , డీసి ముకుంద రెడ్డి ,ఎలక్ట్రికల్ ఈఈ మల్లికార్జున్, వైద్యాధికారి చంద్రశేఖర్ ,ఎంటమాలజీ సహా ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు తథ్యం:

పార్టీ ఫిరాయించిన పది మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడడం తథ్యమని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ అన్నారు. కరీంనగర్‌లో తపస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ, పది సీట్లలో ఉప ఎన్నికలు వస్తే ఏడిట్లో బీజేపీ గెలవడం ఖాయమని అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ దొందూ దొందే అని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేల్లో అసమ్మతి సమావేశాలు రహస్యంగా జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వానికి నూకలు చెల్లబోతున్నాయని, ఎప్పుడు ఊడుతుంతో తెలియని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. కులగణన పేరుతో 60 లక్షల మంది బీసీలను తగ్గించే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. హిందూ జాతిలో ముస్లింలను ఎలా కలుపుతారని ప్రశ్నించారు.

# ఎన్ ఎఫ్ సి నగర్ లో శివాజీ మహారాజ్ 365 జయంతి వేడుకలు

ఘట్కేసర్ ఫిబ్రవరి 19 (నమస్తే హైదరాబాద్)
మేడ్చల్ జిల్లా, ఘట్కేసర్ మున్సిపల్ పరిధిలోని ఎన్ఎఫ్సీ నగర్ చౌరస్తాలో బిజెపి మున్సిపల్ అధ్యక్షులు కొమ్మిడి మహిపాల్ రెడ్డి మరియు శివాజీ విగ్రహ ఏర్పాటు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో చత్రపతి శివాజీ మహారాజ్ 365వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందని, ఇలాంటి జయంతులు ఎన్నో నిర్వహించాలని, ప్రజలంతా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ నాయకులు కే ఎల్ జి ప్రసాద్, గౌరయ్య, సి ఆర్ కే రాజు, గజానంద్ వర్మ, మల్లయ్య గౌడ్, ఆరీప్ప కృపా కుమార్, బిజెపి రాష్ట్ర నాయకులు రామోజీ, బీజేవైఎం అధ్యక్షులు కొమ్మిడి విక్రాంత్ రెడ్డి, మహిళా మోర్చా అధ్యక్షురాలు సుభాషిని, మున్సిపాలిటీ నాయకులు రామతీర్థ, నరేష్, కట్ట రాజశేఖర్, పాడిగం వీరేశం, పల్లె ఆంజనేయులు,



పల్లె శివ, అనిల్ గౌడ్, మధుసూదన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా చత్రపతి శివాజీ జయంతి వేడుకలు

దేవరుప్పుల (నమస్తే హైదరాబాద్):దేవరుప్పుల మండలం సీతారాంపురం గ్రామంలో మరాఠీ సామ్రాజ్య వీరుడు చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అ రెకుల పెద్ద వరికల అంజయ్య, అరెకుల అధ్యక్షుడు గారిడే భాస్కర్, కమిటీ సభ్యులు వరికెల రతన్ బాబు, మాట్లాడుతూ ఎవరైనా సరే శత్రువును బలహీనుడిగా పరిగణించాలని అందుకు విరుద్ధంగా చాలా బలవంతుడిగా భావించి భయాందోళనలకు లోను కావద్దని చెప్పేవారు ఎవరికైనా జీవితంలో కఠినమైన సవాలు ఎదురైనప్పుడు, అది వారిపై ఆధిపత్యం చేయించేలా చూసుకోకూడదన్నారు . ఈ కార్యక్రమంలో గరిడే సత్తయ్య, లాడే శివాజీ, లాడే నరేందర్, కంటరి రాజేందర్, గరేడే నరసింహా, సాపాటి రతన్, సాపాటి మోహన్, తిమ్మాపురం ధర్మాజీ, పెద్ద సోమాజీ, తిమ్మాపూర్ అనిల్, వరికల భాస్కర్ , గరిడే హరీష్, తదితరులు, కార్యక్రమంలో, పాల్గొన్నారు.



# ధర్మ పరిరక్షణకు ప్రతీకగా నిలిచిన చత్రపతి శివాజీ మహారాజ్

## కుల మతాలకు అతీతంగా చక్కటి పాలన అందించిన శివాజీ మహారాజ్

## ముస్లింలను ప్రధాన పోస్టుల్లో నియమించిన శివాజీ

## గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి



నమస్తే హైదరాబాద్ : ధర్మ పరిరక్షణకు ప్రతీకగా నిలిచిన ఛత్రపతి శివాజీ మహారాజ్ శత్రువుల గుండెల్లో నిద్రించినట్లు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూ%శీ%కుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. బుధవారం గజ్వేల్ లో జరిగిన చత్రపతి శివాజీ మహారాజ్ జయంత్యోత్సవాల్లో పాల్గొని ఆయన మాట్లాడారు. మరాఠా యోధులు, కోట్లాదిమంది భారతీయుల ఆరాధ్య దైవంగా నిలిచిన ఆయన అన్ని వర్గాలను ప్రేమించినట్లు గుర్తు చేశారు. ముఖ్యంగా మొగలుల రాజ్యంపై దండెత్తిన శివాజీ తన ముఖ్య అనుచరులుగా, ప్రధాన పదవుల్లో ముస్లింలనే నియమించుకోవడం ప్రత్యేకతగా నిలుస్తుందని తెలిపారు. చత్రపతి శివాజీ అన్ని వర్గాల ఆరాధ్య దైవంగా నిలుస్తూ హిందూ ధర్మాన్ని ప్రపంచవ్యాప్తం జేసినట్లు చెప్పారు. భారతీయులకు స్ఫూర్తి ప్రదాతగా నిలిచిన శివాజీ మహారాజ్ అడుగుజాడల్లో యువత నడవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో ఏఎంసీ నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, నక్క రాములు గౌడ్ ,మైనార్టీ సెల్ కాంగ్రెస్ జిల్లా నేత సమీర్, శ్రీ అయ్యప్ప ఆలయ కమిటీ అధ్యక్షులు డెక్కు శ్రీనివాస్ గుప్త, నాయకులు సుభాష్ చంద్రబోస్, ఊడెం శ్రీనివాస్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, నరసింహారెడ్డి, ఆర్ %ు%ఆర్ కాలనీ రాములు గౌడ్, జంగం రమేష్ గౌడ్, రాజు గౌడ్, సాంబయ్య గుప్త, దప్పు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపక్షం రిపోర్టర్ గౌస్ కుటుంబానికి 5000 రూ.ఆర్థిక సహాయం అందజేసిన టి జేయు జిల్లా అధ్యక్షులు మొహమ్మద్.షానూర్



నమస్తే హైదరాబాద్ :
రామన్నపేట మండలానికి చెందిన ప్రజాపక్షం రిపోర్టర్ మొహమ్మద్ గౌస్ ఇటీవల గుండెపోటుతో స్వర్గస్తులయ్యారు. బుధవారం వారి ఇంటికి తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ షానూర్ బాబా కలిసి వారి కుటుంబ సభ్యులును పరామర్శించి, మనోధైర్యాన్ని కల్పిస్తూ 5వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తులో వారి కుటుంబానికి అండగా ఉంటామని,రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్ట్ కుటుంబాన్ని ఆదుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ ఎటల్లి శ్రీనివాస్, కుకు డాలా మహేందర్ రెడ్డి, లవణం ఉపేందర్, బత్తుల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ కూలీలను, పేదలను మోసం చేయడం పాలకులకు పరిపాటిగా మారింది

## తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండమడుగు నర్సింహా

నమస్తే హైదరాబాద్ :
కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో గెలవడానికి వ్యవసాయ కూలీలకు, పేదలకు అనేక వాగ్దానాలు ఇచ్చి, సంక్షేమ పథకాలు ప్రకటించి ఎన్నికల్లో గెలిచిన తర్వాత వాటిని అమలు చేయకుండా కూలీలను, పేదలను మోసం చేయడం పాలకులకు పరిపాటిగా మారిందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండమడుగు నర్సింహ్మా విమర్శించినారు. బుధవారం స్థానిక సుందరయ్య భవన్, భువనగిరిలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు బొల్లు యాదగిరి అధ్యక్షతన జరగగా ఈ సమావేశంలో నర్సింహ పాల్గొని మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి దేశవ్యాప్తంగా వ్యవసాయ కూలీల సంక్షేమం కోసం, వారి అభివృద్ధి కోసం పాటుపడతామని చెప్పి మొన్న ప్రకటించిన బడ్జెట్లో సంక్షేమ రంగంతో పాటు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కూడా నిధులు తగ్గించారని అన్నారు. ఉపాధి హామీకి 2.5 లక్షల వేల కోట్ల రూపాయలు కేటాయించవలసి ఉంటే కేవలం 86 వేల కోట్ల రూపాయలు కేటాయించడం ఎట్లా కరెక్ట్ అని ప్రశ్నించారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీలో పెద్ద ఎత్తున కూలీలను తగ్గిస్తూ పనులు




కలిపించడం లేదని, చేసిన పనికి వారం వారం వేతనాలు కూడా ఇవ్వడం లేదని అన్నారు. ఇప్పటికైనా తగిన నిధులు కేటాయించాలని, సంవత్సరానికి 200 రోజుల పని దినాలు కల్పించాలని, రోజు కూలీ 800 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం భూమి లేని వ్యవసాయ కార్మికులకు సంవత్సరానికి 12,000 రూపాయలు , పట్టణ కేంద్రాలలో ఉపాధి హామీని అమలు చేస్తామని, ఇండ్లు, రేషన్ కార్డులు, పెన్షన్లు, దళితులకు 12 లక్షల రూపాయలు ఇస్తామని చెప్పిన హామీని అమలుచేసి మాట నిలబెట్టుకోవాలని సూచించారు. వ్యవసాయ కూలీలు ఉపాధి లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని వారందరికీ వెంటనే ఉపాధి హామీ పనులు ప్రారంభించి పని అడిగిన ప్రతి ఒక్కరికి పని కల్పించాలని నర్సింహ డిమాండ్ చేశారు. ఇంకా ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గంగాదేవి సైదులు , జిల్లా ఉపాధ్యక్షులు పల్లెర్ల అంజయ్య , జూకంటి పౌల్ , జిల్లా కమిటీ సభ్యులు దొడ్డి బిక్షపతి , బోయ యాదయ్య , కొండపురం యాదగిరి , మానె సాలయ్య , రాపోతు పద్మ , జాలపు లక్ష్మి , చక్కిల్ల ఉపేంద్ర పాల్గొన్నారు.

# విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

నమస్తే హైదరాబాద్ : అడ్డగూడూరు మండలం చిన్న పడిశాల గ్రామంలో గల ఎంపీపీఎస్ పాఠశాలలో బుధవారం నాడు ఘనంగా స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు, చిన్నారులు డిఈఓ, ఎంఈఓ, ఉపాధ్యాయులుగా పాఠశాల కమిటీ సభ్యులుగా వివిధ బాధ్యతాయుత పాత్రలను పోషించారు. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి ఉమాదేవి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో విలువైనదని ఆ బాధ్యతను నేడు పాఠశాల విద్యార్థిని విద్యార్థులు నిర్వర్తించడం విద్యార్థుల ఆత్మస్థైర్యానికి పెంపొందించడానికి దోహదపడుతుందని, నేటి బాలలే రేపటి పౌరులు, చిన్నారులు రేపటి తరానికి ఆదర్శంగా తమ భవిష్యత్తును నిర్మించుకోవాలని ఉన్నత చదువులతో విద్యావంతులుగా ఉన్నత ఉద్యోగాలు పొందాలని ఆమె అన్నారు ఇట్టి కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు శ్రీలత పాఠశాల కమిటీ చైర్మన్ అల్లే కల్పన విద్యార్థిని విద్యార్థులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు





# చిరంజీవి బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేసిన ప్రముఖ సంగీత దర్శకుడు మణిశర్మ

తెలుగు చిత్రపరిశ్రమలో ఎవరెస్ట్ శిఖరం మెగాస్టార్ చిరంజీవి. వెండితెరపై నటనతో పాటు డాన్సులతోనూ అలరించే ఆయన చిరంజీవి ఐ అండ్ బ్లడ్ బ్యాంక్‌ను స్థాపించి తన అభిమానుల సహకారంతో ఎనలేని సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోన్న సంగతి తెలిసిందే. చిరంజీవి మానస పుత్రిక అయిన చిరంజీవి బ్లడ్ బ్యాంక్‌లో అభిమానులు, సినీ సెలబ్రిటీలు ఎందరో రక్తదానం చేస్తుంటారు. తాజాగా ప్రముఖ సంగీత దర్శకుడు మణిశర్మ రక్తదానం చేసి చిరంజీవిపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. ఇలా మణిశర్మ రక్తదానం చేయటం ఇది రెండోసారి కావటం విశేషం.రక్తదానం 'తో లక్షలాది ఆపన్నుల ప్రాణాలు నిలపాలన్న చిరంజీవి ఆశయాన్ని తమ సంకల్పాన్ని భావించి రక్తదానం చేసిన అభిమానులెందరో.. వారిలో తన స్వరాలతో ప్రేక్షకుల్ని మైమరపించే స్వరబ్రహ్మ 'మణిశర్మ' ఒకరు. చిరంజీవి పిలుపును కర్తవ్యంగా భావించి నేడు ఈ మహత్కార్యంలో భాగమై రక్తదానం చేసిన మణిశర్మ మరెందరికో స్ఫూర్తిగా నిలిచారు. పాటలకు స్వరాలు కూర్చడమే కాదు.. మానవత్వానికి చిరునామాగా నిలవడమూ తెలుసునని నిరూపించారు మణిశర్మ.

ఈ సందర్భంగా మెలోడీ బ్రహ్మ మణిశర్మ మాట్లాడుతూ "ఎప్పటి నుంచో రక్త దానం చేయాలని అనుకుంటున్నాను. నేను నా సంగీతాన్ని చిరంజీవిగారి సినిమాలకు అందించటం ద్వారా అభిమానాన్ని చాటుకున్నాను. ఇప్పుడు రక్తదానం చేయటం అనేది సంతోషంగా ఉంది.. నా వంతు కర్తవ్యంగా భావిస్తున్నాను. లక్షలాది మంది ఇందులో భాగమైయ్యారు. అందులో నేను ఒక బొట్టులాగా ఇప్పుడు చేరాను. ఇలాంటి మంచి కార్యక్రమంలో అందరూ భాగం కావాలి" అన్నారు.





# తొలి మ్యాచ్‌లోనే పాకిస్తాన్ ఘోర పరాజయం..

గత సీజన్ విజేత పాకిస్తాన్ ఛాంపియన్స్ ట్రోఫీ తొలి మ్యాచ్‌లోనే ఘోర పరాజయాన్ని చవిచూసింది. ఆతిథ్య జట్టు న్యూజిలాండ్ చేతిలో 60 పరుగుల తేడాతో ఓడిపోయింది. బుధవారం 321 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో పాకిస్తాన్ 47.2 ఓవర్లలో 260 పరుగులకు ఆలౌటైంది. విలియం ఓ'రూర్కే, మిచెల్ సాంట్నర్ తలా 3 వికెట్లు పడగొట్టారు. మ్యాట్ హెన్రీ 2 వికెట్లు పడగొట్టాడు.కరాచీలోని నేషనల్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో పాకిస్తాన్ జట్టు టాస్ గెలిచి, బౌలింగ్ ఎంచుకుంది. న్యూజిలాండ్ 5 వికెట్లకు 320 పరుగులు చేసింది. న్యూజిలాండ్ తరపున విల్ యంగ్ 107, టామ్ లాథమ్ 126, గ్లెన్ ఫిలిప్స్ 54 పరుగులు చేశారు. పాకిస్తాన్ బౌలర్లలో నసీమ్ షా 2 వికెట్లు పడగొట్టాడు. అబ్రార్ అహ్మద్, హరిస్ రవూఫ్ లకు కూడా తలా ఒక వికెట్ దక్కింది.పాకిస్తాన్ తరపున ఖుష్దిల్ షా (69 పరుగులు), బాబర్ ఆజం (64 పరుగులు) అర్ధ సెంచరీలు సాధించారు.సల్మాన్ అలీ అఘా 42 పరుగులు, ఫఖర్ జమాన్ 24 పరుగులు చేశారు.పాకిస్తాన్: మహ్మద్ రిజ్వాన్ (కెప్టెన్), ఫఖర్ జమాన్, బాబర్ అజామ్, సౌద్ షకీల్, సల్మాన్ అఘా, తయ్యబ్ తాహిర్, ఖుష్దిల్ షా, షహీన్ షా అఫ్రిది, నసీమ్ షా, హరిస్ రౌఫ్, అబ్రార్ అహ్మద్. న్యూజిలాండ్: మిచెల్ సాంట్నర్ (కెప్టెన్), విల్ యంగ్, డెవాన్ కాన్వే, కేన్ విలియమ్సన్, డారిల్ మిచెల్, టామ్ లాథమ్, గ్లెన్ ఫిలిప్స్, మైఖేల్ బ్రేస్‌వెల్, మాట్ హెన్రీ, నాథన్ స్మిత్, విలియం ఓ'రూర్కే.



# రోజూ కొబ్బరి తినడం వల్ల అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు..!

కొబ్బరిలో ఫైబర్, ఐరన్, మాంగనీస్, కాపర్ వంటి అనేక ముఖ్యమైన ఖనిజాలు ఉంటాయి. ఇవి శరీరానికి అవసరమైన న్యూట్రియంట్స్‌ని అందిస్తూ ఆరోగ్యాన్ని మెరుగుపరచే శక్తిని కలిగి ఉంటాయి. ప్రతిరోజూ కొబ్బరిని ఒక నిర్ణీత పరిమాణంలో తీసుకుంటే అనేక ప్రయోజనాలు కలుగుతాయి.షుగర్ నియంత్రణకొబ్బరిలో సహజసిద్ధమైన హెల్దీ ఫ్యాట్స్ ఎక్కువగా ఉంటాయి. ఇవి శరీరంలో ఇన్సులిన్ సున్నితత్వాన్ని పెంచుతాయి. కొబ్బరిలోని ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరిచి రక్తంలో గ్లూకోజ్ స్థాయిని నియంత్రించడంలో సహాయపడుతుంది. కొబ్బరి నూనె కూడా డయాబెటిస్ ఉన్నవారికి మేలు చేస్తుందని పరిశోధనలు చెబుతున్నాయి.ఇమ్యూనిటీకొబ్బరిలో లారిక్ యాసిడ్, యాంటీ బాక్టీరియల్, యాంటీ వైరల్ గుణాలు ఉంటాయి. ఇవి శరీరంలోని రోగనిరోధక వ్యవస్థను బలపరిచే పాత్ర పోషిస్తాయి. కొబ్బరి తినడం వల్ల శరీరం సంక్రమణలకు గురి కాకుండా రక్షితంగా ఉంటుంది.అధిక బరువుకొబ్బరిలో మీడియం చైన్ ట్రైగ్లిసరైడ్స్ (%వీజుం%) ఉండడం వల్ల ఇవి త్వరగా జీర్ణమై శరీరానికి తక్షణ శక్తిని అందిస్తాయి. అలాగే కొబ్బరి తినడం వల్ల ఆకలి నియంత్రణలో ఉంటుంది. దీనివల్ల అధికంగా తినకుండా ఉండగలుగుతాం. ముఖ్యంగా బెల్లీ ఫ్యాట్ తగ్గించడానికి ఇది సహాయపడుతుంది.

మెదడు ఆరోగ్యంకొబ్బరిలో ఉండే సహజ ఖనిజాలు మెదడు పనితీరును మెరుగుపరుస్తాయి. ఇది మెమొరీ పెంపొందించడంలో సహాయపడుతుంది. కొబ్బరిని తినడం వల్ల ఒత్తిడి తగ్గి మానసిక ప్రశాంతత పెరుగుతుంది. జీర్ణక్రియకొబ్బరిలో ఫైబర్ అధికంగా ఉండడం వల్ల జీర్ణక్రియ సక్రమంగా సాగుతుంది. దీని వల్ల మలబద్ధకం సమస్య తగ్గుతుంది. గట్ హెల్త్ మెరుగుపడి ఆరోగ్యకరమైన బ్యాక్టీరియా పెరుగుతుంది. చర్మానికి, జుట్టు ఆరోగ్యానికి..కొబ్బరిలోని హెల్దీ ఫ్యాట్స్ చర్మాన్ని మృదువుగా, కాంతివంతంగా మార్చడానికి సహాయపడతాయి. కొబ్బరి నూనెను జుట్టుకు అప్లై చేస్తే పొడిబారిన జుట్టు మృదువుగా మారుతుంది. జుట్టు ఊడడం తగ్గి దృఢంగా పెరుగుతుంది.



కొబ్బరిని ఎలా తినాలి..?

ఉదయం ఖాళీ కడుపుతో కొద్దిగా పచ్చి కొబ్బరి తినవచ్చు.

కొబ్బరిని తురిమి అన్నంలో కలిపి తినవచ్చు.

స్మూతీల్లో కొబ్బరి తురుము లేదా కొబ్బరి నీళ్లు కలిపి తీసుకోవచ్చు.

చట్నీల రూపంలో వాడుకోవచ్చు.

బేకింగ్ లో కొబ్బరి పొడి ఉపయోగించి న్యూట్రిషియస్ ఫుడ్స్ తినవచ్చు.

అయితే కొబ్బరి మితంగా తీసుకోవడం మంచిది. ఎక్కువగా తీసుకుంటే కొన్నిసార్లు అజీర్ణం వంటి సమస్యలు రావొచ్చు. కాబట్టి ఒక పరిమితి పాటించి కొబ్బరి ప్రయోజనాలను ఆస్వాదించండి.

# మార్కెట్‌లోకి నయా ఈవీ స్కూటర్ లాంచ్..



ప్రముఖ కంపెనీ బ్యాట్‌ఆర్‌ఈ ఎలక్ట్రిక్ మొబిలిటీ ప్రైవేట్ లిమిటెడ్ భారత మార్కెట్లో కొత్త ఎలక్ట్రిక్ స్కూటర్‌ను విడుదల చేసింది. ఎల్‌ఓఈవీ ప్లస్ పేరుతో లాంచ్ చేసిన ఈ స్కూటర్ ధర రూ.69,999గా ఉంటుంది. ఈ ఎలక్ట్రిక్ స్కూటర్ అధీకృత డీలర్ల వద్ద కొనుగోలుకు సిద్ధంగా ఉన్నాయి బ్యాట్ ఆర్‌ఈ ఎల్‌ఓఈవీ ప్లస్ స్కూటర్ మూడు రైడింగ్ మోడ్‌లతో ఆకట్టుకుంటుంది. ఈ స్కూటర్ ఎకో మోడ్‌లో గంటకు 35 కిమీదూసుకు పోతే కంఫర్ట్ మోడ్ 48 కిలోమీటర్ల వేగంతో దూసుకువెళ్తుంది. అయితే స్పోర్ట్స్ మోడ్‌లో మాత్రం సాధారణ స్కూటర్లలా గంటకు 60 కిలో మీటర్ల వేగంతో వెళ్లవచ్చు. స్కూటర్‌కు సంబంధించిన ఇన్ఫర్మేటివ్ స్పీడోమీటర్ ఆకట్టుకుంటుంది. బ్యాట్ ఆర్‌ఈ ఎల్‌ఓఈవీ ప్లస్ అమరాన్ బ్యాటరీతో వస్తుంది. 2 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీ ప్యాక్‌తో, 13 ఏఎంపీ ఛార్జర్ ఈ స్కూటర్ ప్రత్యేకతలు. అలాగే బ్యాటరీ, ఛార్జర్ రెండూ ఐపీ 67 రేటింగ్‌తో వస్తుంది. ప్రీమియం బ్యాటరీ 21700 సెల్స్‌ను ఉపయోగిచడం వల్ల దీర్ఘకాలిక పనితీరుతో వస్తుందని కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు. ఈ బ్యాటరీను కేవలం 2 గంటల 30 నిమిషాల్లోనే పూర్తిగా చార్జ్ చేయవచ్చు. అలాగే బ్యాటరీ, ఛార్జర్ రెండింటి పై 3 సంవత్సరాల వారంటీను కంపెనీ అందిస్తుంది. బ్యాట్ ఆర్‌ఈ ఎల్‌ఓఈవీ ప్లస్ క్రూయిజ్ కంట్రోల్, ఎల్‌ఈడీ ల్యాంప్స్ హిల్ హెల్డ్ అసిస్ట్, సీఏఎన్ -ఎనేబుల్డ్ కమ్యూనికేషన్ సిస్టమ్ వంటి లక్షణాలతో వస్తుంది. పార్కింగ్ మోడ్, 12 అంగుళాల అల్లాయ్ వీల్స్, కంబైన్డ్ డిస్క్ బ్రేక్ సిస్టమ్, శారీ గార్డ్ వంటి ఫీచర్లతో వస్తుంది.

బ్యాట్ ఆర్‌ఈ ఎల్‌ఓఈవీ ప్లస్ స్కూటర్ 180 మి.మి గ్రౌండ్ క్లియరెన్స్‌తో వస్తుంది. బ్యాట్ ఆర్‌ఈ ఎల్‌ఓఈవీ ప్లస్ ఐదు రంగులతో అందుబాటులో ఉంటుంది. స్టార్ట్ బ్లూ, స్టార్మీ గ్రే, ఐస్ బ్లూ, మిడ్నైట్ బ్లాక్, పెర్ల్ వైట్ కలర్స్‌లో కొనుగోలుకు సిద్ధంగా ఉంటాయి. అమరాన్ అందించే అధునాతన బ్యాటరీతో నడిచే అత్యంత ఫీచర్లతో కూడిన తమ స్కూటర్ ఆకట్టుకుంటుంది. బ్యాట్ ఆర్‌ఈ ఎలక్ట్రిక్ మొబిలిటీ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ నిశ్చల్ చౌదరి పేర్కొన్నారు. ఈ స్కూటర్ పట్టణ ప్రజలను దృష్టిలో పెట్టుకుని డిజైన్ చేశామని వివరించారు.

Printed published and owned by Godishala Somaiah published from # 15-76,Medipally, Ghatkesar,Ranga reddy,Dist,Printed at Sri SehaSai Printers,IDA BalaNagar, Hyderabad,Editor : Godishala Somaiah,email:nhnews24@gmail.com,ph 9912580066,RNI APTEL/2012/45237..